క్లుప్తంగా

రక్తదాన శిబిరం



కావలి: పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు శాఖలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ లక్ష్మీనారాయణ, పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ కావలి శాఖ సహకారంతో నిర్వహించిన శిబిరంలో బ్యాంకు సిబ్బందితో పాటు పలువురు ఖాతాదారులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ రక్తదాతలను అభినందించారు. బ్యాంకు సిబ్బంది ఎస్‌కే అమన్జీ, దిలీప్, జే మనోహర్, సీహెచ్ పణికుమార్, కె సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు దుప్పట్ల వితరణ



దాతలు వితరణ చేసిన దుప్పట్లతో చిన్నారులు

కావలి: పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ సంరక్షణలో చదువుకుంటున్న పేద పిల్లలకు బోగోలు మండలం ముంగమూరుకు చెందిన మద్దెల సుశీలమ్మ ఐదో వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు శనివారం దుప్పట్లను వితరణ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. దాతలకు సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ధన్యవాదాలు తెలిపారు. సుశీలమ్మ కుమారులు, కోడళ్లు ఎం లక్ష్మణ్‌కుమార్, నీరజ, ఎం రాంబాబు, రాజ్యలక్ష్మి, ఎం ప్రసాద్, అల్లుడు, కుమార్తె రాజేంద్రప్రసాద్, భవిత, అక్కాబావ ఎం వెంకయ్య, బుజ్జమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆత్మకూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యురాలు షేక్ అస్మా సూచించారు. పట్టణంలోని 19వ వార్డు పరిధిలోని పాఠశాల వద్ద శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈఓ సుధాకర్, ఎంపీహెచ్‌ఎస్ పార్వతి, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్‌కూలర్ వితరణ



వరికుంటపాడు: మండలంలోని కాకొల్లువారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మాజీ మంత్రి మాదాల జానకిరాం జ్ఞాపకార్థంగా జీ మాలకొండరాయుడు వాటర్ కూలర్, మైక్‌సెట్‌ను శనివారం వితరణ చేశారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు.

సాయి ట్రస్టు సేవలు అభినందనీయం



జలదంకి: మండలంలోని నెహ్రూనగర్‌లోని పేదలకు సాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ యువమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వద్దే శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన సాయి చారిటబుల్ ట్రస్టు సభ్యులను అభినందించారు. ట్రస్టు అధ్యక్షురాలు పొన్నగంటి మాధవి మాట్లాడుతూ ప్రవాస భారతీయులు రామకృష్ణ, అనిత దంపతులు, కిరణ్, కవిత, పాపయ్య సహకారంతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ట్రస్టు సభ్యులు పద్మావతి, సునీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శనివారం నగదు సాయం అందజేశారు. 1వ వార్డుకు చెందిన ఎం కృష్ణారెడ్డి, 14వ వార్డుకు చెందిన షేక్ ఖాదర్‌బాషా, 18వ వార్డుకు చెందిన షేక్ జాకిర్, 19వ వార్డుకు చెందిన చౌటూరు సుబ్బమ్మ, 22వ వార్డుకు చెందిన జెక్కా యానాదయ్య, సీహెచ్ పెంచలమ్మ, 23వ వార్డుకు చెందిన షేక్ బికారిసాహెబ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి రూ.10వేలు చొప్పున నగదు సాయం అందజేశారు. ఆయన వెంట రాంపల్లి ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

వేరుశనగ సాగుకు సన్నద్ధం

- తీరంలోని ఇసుక నేలల్లో విస్తారంగా సాగు
- మార్కెట్లోనూ ఎల్లప్పుడు గిట్టుబాటు ధరలు
- లాభసాటిగా సాగు ఉండడంతో రైతుల ఆసక్తి



వేరుశనగ సాగుకు ట్రాక్టర్‌తో దుక్కి సిద్ధం చేస్తున్న రైతు

కావలి: కావలి నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాల రైతులు వేరుశనగ సాగుకు సన్నద్ధమవుతున్నారు. తీరంలోని ఇసుక నేలలు వేరుశనగ సాగుకు అనుకూలంగా ఉంటాయి. ఈ పంట తక్కువ కాలంలో చేతికందుతుంది. మంచి దిగుబడులు వస్తాయి. మార్కెట్లోనూ ఎల్లప్పుడూ గిట్టుబాటు ధరలు ఉంటూ ఆదాయం వస్తుండడంతో తీరప్రాంత రైతులు వేరుశనగ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

10వేల ఎకరాలకుపైగా సాగు

కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లోని తీరప్రాంత రైతులు వేరుశనగ సాగుకు సమాయత్తమవుతున్నారు. వేరుశనగ సాగుకు మంచి అదను కావడం ...వర్షాలు పడడంతో దుక్కులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది తీరంలోని ఇసుక నేలల్లో దాదాపు 10,250 ఎకరాల్లో వేరుశనగ సాగు చేపడుతున్నారు. వేరుశనగ పంట 100 నుంచి 120 రోజుల కాలవ్యవధిలో చేతికందుతుంది. తీరంలోని ఇసుక నేలల్లో స్ప్రింకర్ల ద్వారా తక్కువ నీటితోనే సాగుచేసే అవకాశం ఉండడంతో రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

లాభదాయకంగా సాగు

వేరుశనగ సాగు లాభదాయకంగా ఉంటోంది. పంట బాగా పండితే ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి. ఎకరా సాగుకు రూ.20వేల వరకు పెట్టుబడులు అవుతాయి. మార్కెట్లోనూ ఎల్లప్పుడూ గిట్టుబాటు ధరలు ఉంటాయి. క్వింటా రూ.8వేల నుంచి రూ.9వేల వరకు పలుకుతోంది. పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరాకు రూ.50వేల నుంచి రూ.60వేల వరకు నికర ఆదాయం ఉంటుంది. ఇతర పంటలతో పోల్చితే తక్కువ వ్యవధిలోని మంచి ఆదాయం వస్తుండడంతో తీరప్రాంత రైతులు వేరుశనగ సాగుపై మక్కువ చూపుతున్నారు.

గిట్టుబాటు ధరలు ఉంటాయి



వేరుశనగ సాగుకు అదును కావడంతో విత్తనాలు విత్తేందుకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నాం. తీరంలోని ఇసుక నేలలు సాగుకు అనుకూలంగా ఉంటాయి. స్ప్రింకర్ల ద్వారా తక్కువ నీటితోనే పంటను సాగుచేయవచ్చు. నాలుగు నెలల్లోనే పంట చేతికందుతుంది. మార్కెట్‌లోనూ ఎల్లప్పుడూ గిట్టుబాటు ధరలు ఉండి మంచి ఆదాయం వస్తుండడంతో సాగు వైపు మొగ్గుచూపుతున్నాం. – వెంకారెడ్డి, రైతు, పూలదొరువు

చంద్రబాబుది అరాచక పాలన

- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో చంద్రబాబునాయుడు కొత్తపోకడలతో అరాచక పాలన సాగిస్తున్నారని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కావలిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో మాదిరిగానే 2024 ఎన్నికల్లోనూ అబద్ధాలతో మరోమారు అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ప్రజలను నమ్మించి మోసం చేయడమే పాలన అనే భావంతో ఉన్నారన్నారు. ఆరు నెలల కూటమి ప్రభుత్వ నియంతృత్వ పోకడలే అందుకు నిదర్శనమన్నారు. సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకపోగా ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు బనాయించడమే కాకుండా పోలీసులతో కొట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే చంద్రబాబు మోసాలు, అబద్ధాలు, అరాచక పాలనను ప్రజలు పూర్తిగా తెలుసుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకునేందుకు ఎవరూ భయపడొద్దని, ప్రజలకు అండగా ఉండాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కావలి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేసేది గోరంత, చెప్పుకునేది కొండంతగా ఉందని ఎద్దేవా చేశారు. పట్టణంలోని పెద్దపవని రోడ్డులో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి అసంపూర్తిగా ఉందని, దానిని పూర్తి చేయకుండా ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి సాకులు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే మాటలు చెబుతున్నారన్నారు. బ్రిడ్జి నిర్మాణాన్ని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పూర్తి చేయిస్తే తాను ఆయనపై ఎన్నికల్లో పోటీ చేయనని శపథం చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో తాను జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి రామాయపట్నం పోర్టు వరకు రోడ్డు, తుమ్మలపెంట రోడ్డు నుంచి ఏనుగుల బావి వరకు రోడ్డును మంజూరు చేయించి పూర్తి చేసినట్లు తెలిపారు. బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల్లోనూ అనేక రోడ్లు నిర్మించానని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను రూ.350 కోట్లతో పూర్తి చేసి మత్స్యకారులకు అంకితం చేశామని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు సంబంధించి రూ.10 కోట్లు కూడా ఖర్చు కాని బ్రిడ్జి కోసం కూటమి ప్రభుత్వం హడావుడిగా రూ.22 కోట్లను మంజూరు చేసిందన్నారు. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వ నిధులను దోచి పెట్టడమే లక్ష్యంగా బ్రిడ్జికి అధిక నిధులు మంజూరు చేయించుకుని ఫిషింగ్ హార్బర్‌ను తామే నిర్మించామని టీడీపీ డబ్బా కొట్టుకుంటోందని మండిపడ్డారు. కావలిలోని బృందావనం కాలనీ నుంచి ముసునూరు బైపాస్ వరకు ట్రంకురోడ్డు విస్తరణకు తమ ప్రభుత్వంలోనే రూ.55కోట్లు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. తుమ్మలపెంట రోడ్డు నిర్మాణానికి రూ.14.8 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ట్రంకురోడ్డు విస్తరణతో పాటు తుమ్మలపెంట రోడ్డు పనులను అవగాహన రాహిత్యంతో ఇష్టానుసారంగా చేస్తున్నారని మండిపడ్డారు. రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించకుండా పనులు చేపడుతుండడంతో వర్షపు నీరు రెండు అడుగుల మేర ప్రవహిస్తోందన్నారు. ఈ కారణంగా త్వరగా రోడ్లు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అంటే టెంపరరీ డెవలప్‌మెంట్ పార్టీ అని, ఏదీ కూడా శాశ్వతంగా ఉండేలా పనులు చేపట్టదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ పోకడలను కావలి ప్రజలు గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, పందిటి కామరాజు, కనమర్లపూడి వెంకట నారాయణ, సన్నిబోయిన ప్రసాద్, గుడ్లూరు మాల్యాద్రి, దామిశెట్టి సుధీర్ నాయుడు, మందా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక

ఉదయగిరి: వర్షాలకు దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఇన్‌చార్జి ఏడీఏ చెన్నారెడ్డి తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వీఆర్వో, సర్వేయర్, వీఏఏల ఆధ్వర్యంలో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను గుర్తించి జాబితాను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందజేస్తుందన్నారు. వర్షాలకు శనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేస్తామని తెలిపారు.

సీతారామపురం : వర్షాలకు 33శాతం మించి పంటలు దెబ్బతిన్న రైతులకే నష్టపరిహారం అందించే జాబితాలో చోటు లభిస్తుందని ఏఓ చెన్నారెడ్డి శనివారం తెలిపారు. వీఆర్వో, సర్వేయర్, వీఏఏలు సంయుక్తంగా దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించి నష్టపోయిన రైతుల జాబితాను తయారు చేస్తారని చెప్పారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో జాబితాలను ప్రదర్శించి తుది జాబితాను నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

రక్త నమూనాల సేకరణ



వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఉదయగిరి మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌ఓ రాజశేఖరరాజు ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది 300 మంది నుంచి రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 8 బోధకాలు కేసులు నమోదయ్యాయని తెలిపారు. దీంతో ఇంకా ఎవరికైనా వ్యాధి లక్షణాలు ఉన్నాయోమోనని గుర్తించేందుకు ముందస్తు జాగ్రత్తగా రక్తనమూనాలను సేకరించి నెల్లూరు ల్యాబ్‌కు పంపిస్తున్నామని తెలిపారు. సూపర్‌వైజర్ వెంకటయ్య పాల్గొన్నారు.

పైప్‌లైన్ ధ్వంసం చేశారని ఫిర్యాదు

సంగం: తన పొలంలోని పైప్‌లైన్‌ను సూర్యనారాయణ అనే వ్యక్తి జేసీబీతో ధ్వంసం చేసి తనకు నష్టం కలిగించారని సంగానికి చెందిన పోలిశెట్టి ఆంజనేయులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. తనకు రూ.20వేల మేర నష్టం ఏర్పడిందన్నారు. తాను పంట వేసుకునేందుకు సిద్ధమవుతున్నానని, పైపులైన్‌ను బాగు చేయించాలని ఎన్నిసార్లు కోరినా సూర్యనారయణ స్పందించడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరాడు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా పోలీసులు సూర్యనారయణపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు వాపోయాడు.

జాతీయస్థాయి క్రీడాకారిణికి అభినందన



అర్చనకు దాత అందజేసిన నగదు సాయాన్ని అందజేస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన బట్టేపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని అర్చనను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. ఆత్మకూరులోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం జరిగిన పీటీఎం కార్యక్రమంలో అర్చనకు దాత శశిధర్ రెడ్డి అందజేసిన రూ.10వేలు నగదు సాయాన్ని అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించి ఆత్మకూరుకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రెవెన్యూ సదస్సు వాయిదా

సీతారామపురం : మండలంలోని పబ్బులేటిపల్లిలో శనివారం జరగాల్సిన రెవెన్యూ సదస్సును అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. మళ్లీ రెవెన్యూ సదస్సు ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

10న జాబ్‌మేళా

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ నారాయణస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి చొరవచూపాలి



మాట్లాడుతున్న జడ్జి ఎం శోభ

కావలి: మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి న్యాయవాదులు చొరవచూపాలని కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ అన్నారు. కావలి బార్ అసోసియేషన్ హాల్లో హైకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు . ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ అధ్యక్షత వహించి మాట్లాడారు. సమస్యలకు పరిష్కార దిశగా మధ్యవర్తిత్వం పని చేస్తుందన్నారు. మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. కక్షిదారులకు విడతల వారిగా కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా రాజీకుదిర్చి కేసులను పరిష్కరించవచ్చని తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే కాత్యాయిని, స్పెషల్ మేజిస్ట్రేట్ పీ పరుశురాం, న్యాయవాదులు రోజ్‌దార్, జీ రాజేంద్ర ప్రసాద్, టీ మల్లికార్జున, కెన్నడి, జగన్‌మోహన్, సీహెచ్ సునీల్, ఐ సాయిప్రసాద్, జే శ్రీదేవి , బార్ అసోసియేషన్ సెక్రటరీ జయప్రకాష్, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలి

- మంత్రి ఆనం



ఉదయగిరి: గండిపాళెం గురుకులంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల



ఆత్మకూరు: బాలికల గురుకులంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం



కావలి: మనబడి బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

ఆత్మకూరు: ఇటీవల కాలంలో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే పదోతరగతిలో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంటోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదరించాలని, వాటి అభివృద్ధికి సహకరించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అనంతలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం(పీటీఎం)లో ఆయన మాట్లాడారు. 2023–24 విద్యాసంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో 2,595 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అందులో బాలికలు 92 శాతం, బాలురు 81 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఈ స్థాయి ఫలితాలను ప్రైవేట్ పాఠశాలల్లో గమనించారా? అని తల్లిదండ్రులను ప్రశ్నించారు. అనంతరం క్రీడాపోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థి తులసీకుమార్, తల్లిని మంత్రి అభినందించారు. జాతీయస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన 15 మంది విద్యార్థులకు ట్రాక్ సూట్‌లు అందజేశారు. మనబడి, మనపత్రిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బైపాస్‌రోడ్డులోని ఏపీ బాలికల గురుకులంలో ప్రిన్సిపల్ కామేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ప్రహరీ, క్రీడామైదానం, అంతర్గతరోడ్లు, ఆర్వో ప్లాంట్, కంప్యూటర్లు, తదితర సౌకర్యాలు కల్పించాలని మంత్రిని కోరగా స్పందించారు. దాతల సహకారంతో మరో ఆర్వో ప్లాంట్‌తో పాటు పదిహేను కంప్యూటర్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. గురుకులంలో ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహించేలా విద్యాశాఖ మంత్రితో మాట్లాడతామన్నారు. జెడ్పీ సీఈఓ విద్యారమ, ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, ఎంఈఓ జ్యోతి, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, గిరినాయుడు, కే రవీంద్రారెడ్డి, చంద్రారెడ్డి, పులిమి శైలజ, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో విద్యార్థులకు బ్యాగులు అందజేస్తాం

కావలి/బిట్రగుంట: వచ్చే విద్యా సంవత్సరం నుంచి తన సొంత నిధులతో కావలి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తానని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి తెలిపారు. కావలిలోని ముసునూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఈఓలు నరసింహారావు, జయమ్మ, కావలి రూరల్ సీఐ పాపా రావు, తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా తల్లిదండ్రుల హాజరు

ఉదయగిరి: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన పేరెంట్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి నామమాత్రంగా తల్లిదండ్రులు హాజరయ్యారు. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 496 మంది విద్యార్థులు ఉండగా, కేవలం 50మందిలోపే తల్లిడండ్రులు ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. అందులోనూ 21 మంది ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులే ఉండడం విశేషం. వింజమూరు బాలురు ఉన్నత పాఠశాలలో వేయి మంది విద్యార్థులు ఉంటే కేవలం పదుల సంఖ్యలోనే తల్లిదండ్రులు హాజరయ్యారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఉదయగిరి/దుత్తలూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఉదయగిరి మండలం గండిపాళెం గురుకుల పాఠశాల, దుత్తలూరులోని ఆదర్శ పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సైమన్‌రావు, దుత్తలూ రు తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓ వెంగయ్య పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో ప్రిన్సిపల్ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఎస్సై సైదులు, డీటీ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.

చేజర్ల: చేజర్ల , తూర్పుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు హైమావతి, సరోజ అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. చేజర్లలో డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ విజయలలిత, ఎంఈఓ–2 డీసీ మస్తానయ్య, మాజీ ఎంపీపీ రావి పెంచల రెడ్డి పాల్గొన్నారు.

జలదంకి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో తెలుగుగంగ డిప్యూటీ కలెక్టర్ ఏ మురళీకృష్ణ విద్యార్థుల చదువు, పాఠశాలల అభివృద్ధి, తల్లిదండ్రుల పాత్రపై చర్చించారు. ఎంఈఓ శ్రీధర్,ఎస్‌ఎంసీ చైర్మన్ సుందరయ్య పాల్గొన్నారు.

కొండాపురం: స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో ప్రిన్సిపల్ పీ జయంతి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఎంపీడీఓ ఆదినారాయణ, ఎంఈఓ–2 ఆనందరావు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో అనుబంధాన్ని పెంచుకోవాలని సూచించారు.

ఆత్మకూరురూరల్: కరటంపాడు, వాసిలి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఆత్మీయ సమావేశాలకు జెడ్పీ సీఈఓ విద్యారమ హాజరై మాట్లాడారు. కరటంపాడు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న గార్లపాటి ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్ నాయుడును అభినందించారు. ఎంఈఓ–2 చలపతి, హెచ్‌ఎం మాలకొండలరావు, ఇస్మాయిల్, అంకయ్య పాల్గొన్నారు.

అల్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు హాజరై విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్రను వివరించారు.

వరికుంటపాడు: తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాల, వరికుంటపాడు మెయిన్, ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన ఆత్మీయ సమావేశాలకు ఎంఈఓ–2 సీహెచ్ రమణయ్య హాజరయ్యారు. తల్లిదండ్రులు తమ బిడ్డల విద్య, క్రమశిక్షణపై శ్రద్ధ కనబరచాలని సూచించారు.

సీతారామపురం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ మస్తాన్‌వలి, ఈఓపీఆర్డీ భార్గవి పాల్గొన్నారు.

సంగం: సంగం, తరుణవాయి ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు బుజ్జయ్య, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలోని ఎంపీయూపీ పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు.

కలిగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు, ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి, ఎంఈఓ సురేష్‌బాబు, ఎస్సై ఉమాశంకర్ పాల్గొన్నారు. కలిగిరి జెడ్పీ హైస్కూల్‌లో స్థలదాత జొన్నలగడ్డ రామానాయుడుకు నివాళులర్పించారు.

ఉపాధ్యాయుల్లో తీవ్ర అసహనం

బిట్రగుంట: ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహణ భారాన్ని ఉపాధ్యాయులపై మోపడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి పదికి పైగా పనులు అప్పగించడంతో ఉపాధ్యాయులు విసిగిపోయారు. ఆరు రకాల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని చెప్పడం, యాప్‌లు డౌన్‌లోడ్ చేయించడం, అతిథులు, కమిటీలను ఎంపిక చేయడం, విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేయించడం, విద్యార్థుల తల్లిదండ్రులకు వేర్వేరుగా ఆటలు, ముగ్గుల పోటీలు ఏర్పాటు, స్నాక్స్, మధ్యాహ్న భోజనం ఏర్పాటు, షామియానాలు వేయించడం, ఈ ఫొటోలను మళ్లీ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయించడం, తదితర పనులతో తమను ఈవెంట్ ఆర్గనైజర్లుగా మార్చేశారని ఉపాధ్యాయులు వాపోయారు. ప్రభుత్వం ఇస్తున్న అరకొర డబ్బులు ఫ్లెక్సీలకు కూడా చాలలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు అనంతరాయనియేని గిరిజనకాలనీకి వెళ్లే రోరోడ్డు వర్షాలకు దారుణంగా తయారైంది. కాలనీలో సుమారు 90 కుటుంబాలకుపైగా నివాసం ఉంటున్నాయి. పట్టణం నుంచి కాలనీకి 2.5కిలోమీటర్ల దూరం ఉంటుంది. వర్షాలకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. గుంతల్లో నీరు నిలిచి రోడ్డు బురదమయంగా తయారైంది. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీల్లేకుండా ఉంది. దీంతో రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గండిపాళెంలో 19 అడుగుల నీటిమట్టం

ఉదయగిరి : మండలంలోని గండిపాళెం జలాశయంలో శనివారానికి నీటి మట్టం 19 అడుగులకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి జలాశయానికి 600 క్యూసెక్కుల వంతున ఇన్‌ఫ్లో కొనసాగుతోందని ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి తెలిపారు. మరో వారం రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో ప్రాజెక్ట్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం 35 అడుగులకు చేరవచ్చని అంచనా వేస్తున్నామన్నారు.

16,17న శిక్షణా తరగతులు

ఆత్మకూరురూరల్: మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు ఈ నెల 16, 17 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే శిక్షణా తరగతులకు ఆహ్వానితులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.